క్లుప్తంగా

ముగిసిన కృషి విజ్ఞాన కేంద్రాల జోనల్ వర్క్‌షాప్

గుంటూరు రూరల్: ఐసీఏఆర్ అటారి జోన్ 10 ద్వారా నాలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి పరిధిలోని 72 కృషి విజ్ఞాన కేంద్రాలకు ప్రతి సంవత్సరం నిర్వహించే జోనల్ వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ వర్క్‌షాపునకు రాజమండ్రి వేదికైంది. హైదరాబాద్ అటారి జోన్ 10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపునకు ముఖ్య అతిథిగా ఢిల్లీకి చెందిన ఐసీఏఆర్ విస్తరణ విభాగం డీడీజీ డాక్టర్ యూఎస్ గౌతమ్ హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో పార్వతీపురం రస్తకుటుంబాయి కృషి విజ్ఞాన కేంద్రానికి ఉత్తమ అవార్డు వరించింది. కార్యక్రమంలో ఐఐటీఆర్ పెదవేగికి చెందిన డాక్టర్ ఆర్కే మాతుర్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు డాక్టర్ బి ప్రమీలా రాణి, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని రోడ్ల వెంట ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం జిల్లా వైద్యశాల రోడ్డులో ఉన్న ఆక్రమణలు, చెట్ల కొమ్మలను తొలగించారు. బాలాజీరావుపేటలోని గిరి రోడ్డు నందు ఆక్రమణలను తొలగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీటీ ప్లానర్లు సుధాకర్, సుబ్బారావు, త్రీటౌన్ పోలీసులు, టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీలు టిఫిన్ బాక్సుల పంపిణీ

తెనాలి అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం పుట్టిన రోజును పురస్కరించుకుని సత్యనారాయణ టాకీస్ రోడ్డులోని మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం స్టీల్ టిఫిన్స్ బాక్సులు, పలకలు, కేకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సాతులూరి రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన వస్తువులను దాతలు సమకూర్చడం అభినందనీయమన్నారు. ముందుగా సుబ్రహ్మణ్యంకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నేరెళ్ల కృష్ణమోహన్‌రావు, నాయకులు డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, పాదర్తి వెంకటేశ్వరరావు, కోనిజేటి రమేష్‌కృష్ణ, ఉపాధ్యాయులు షేక్ రాబియా, తుల్లిమిల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చూడండి

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల వల్ల నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డు, చినరావూరు, ఐతానగర్, విజయవాడ వెళ్లే ప్రధాన రహదారిని గురువారం ఉదయం ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వల్లో పారుదల ఉండే విధంగా చూడాలన్నారు. కాల్వల్లో వ్యర్థాలు ఉంటే వెంటనే తొలగించాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనుపమ, బాజీ, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

విత్తన దుకాణాలలో తనిఖీ



తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని విత్తన దుకాణాలను గురువారం వ్యవసాయ అధికారి పి. శిరీష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే రైతులకు విత్తనాలు అమ్మాలని పేర్కొన్నారు. ఎక్కువ ధరకు అమ్మినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు విత్తన దుకాణాలలో లైసెన్స్‌లు, నిల్వలను తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా వరి విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుగ్గిరాలలో జీడీసీఎంఎస్, పెదకొండూరు గ్రామంలో శ్రీ కనకపుట్లమ్మ తల్లి ట్రేడర్స్, హేమ దుర్గ ట్రేడర్స్, పెదపాలెం గ్రామంలో వెంకట కార్తికేయ ట్రేడర్స్, రాధాకృష్ణ ఎంటర్‌ప్రైజెస్, చినపాలెంలో మణికంఠ ఎంటర్‌ప్రైజెస్, పెరికలపూడిలో శ్రీ సాయి కార్తీక్ ట్రేడర్స్, శ్రీ లక్ష్మి శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, గంగ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, ఈమనిలో గాయత్రి ట్రేడర్స్, సాంబశివ ట్రేడర్స్, సిద్ధార్థ ట్రేడర్స్, జీవిత ట్రేడర్స్, మోరంపూడి గ్రామంలోని హర్షిత ట్రేడర్స్, కంఠంరాజు కొండూరు గ్రామంలో ఉన్న బాబు ఫెర్టిలైజర్స్, వెంకట రమణా ఫెర్టిలైజర్స్, చిలువూరు గ్రామంలో ఎస్‌వీఎస్ ట్రేడర్స్, తుమ్మపూడి గ్రామంలో బిస్మిల్లా రహనా ట్రేడర్స్ షాపులకు రైతులు దుకాణం నుంచి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని తెలిపారు.

వయ్యారి భామ.. రైతుకు శ్రమ

- సమస్యాత్మక కలుపు మొక్క విస్తరణ
- పంటలకు సోకుతున్న చీడపీడలు
- చర్మవ్యాధులతోపాటు పలు రుగ్మతలు



వయ్యారిభామ మొక్క

తాడేపల్లి రూరల్ : మంగళగిరి నియోజకవర్గంలో సమస్యాత్మక కలుపు మొక్కగా మారిన వయ్యారి భామ విస్తారంగా వ్యాపిస్తోంది. రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒక హానికరమైన కలుపుమొక్క అయిన దీనిని కాంగ్రెస్ గడ్డి, నక్షత్ర గడ్డ, మంగమ్మ చెట్లు అని పిలుస్తారు. దీనిని నివారించేందుకు ఢిల్లీలోని జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, తిరుపతిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వయ్యారి భామను నిర్మూలిద్దాం – ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కలుపు మొక్కను సామూహికంగా నిర్మూలించకపోతే రైతులకు తీరని నష్టం చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక్కొక్క మొక్క 10 వేల నుంచి 50 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. పంట పొలాలు, బీడు, బంజరు భూములు, జనావాసాల చుట్టూ, పాడుబడిన ప్రదేశాల్లోనూ విస్తారంగా పెరుగుతుంది.

కలిగే నష్టాలు ఎన్నో

- పంట పొలాల్లో 40 శాతం, పశుగ్రాసం పంటలలో 90 శాతం దిగుబడిని ఈ వయ్యారి భామ తగ్గిస్తుంది. అలాగే వాటి పుప్పొడి టమాట, వంగ, మిరప, మొక్కజొన్న పుష్పాలపై పడినప్పుడు వాటిలో ఫలోత్పత్తి నిరోధించబడుతుంది. పార్థీనియం కొన్ని రకాల వైరస్‌లకు ఆశ్రయమిస్తూ, వివిధ పంటలలో వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందడానికి కారణమవుతుంది.
- వేరుశనగ, టమాట, మిరప, పొద్దు తిరుగుడు పంటల్లో మొవ్వ కుళ్లు తెగుళ్లను వ్యాప్తి చేయడానికి కారణం ఇదే.
- మనుషులలో డెర్మాటైటిస్, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకై టీస్, పుష్పాల పుప్పొడితో జలుబు, కండ్లు ఎర్రబడటం, కనురెప్పలు వాయడం మొదలైన ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- పశువులలో వెంట్రుకలు రాలిపోవడం, హైపర్‌టెన్షన్‌కు గురి కావడం జరుగుతుంది.

నివారణ పద్ధతులు

- మొక్కలు పూతకు రాకముందే చేతులకు తొడుగులు ధరించి పీకి వేసి తగులబెట్టాలి.
- బంతితో పంటమార్పిడి చేస్తే తర్వాత వేసే పైరులో పార్థీనియం ప్రభావం తక్కువగా ఉంటుంది.
- జైగోగ్రామా, బైకొలరేటా పురుగులను ఉపయోగించి జీవనియంత్రణ ద్వారా ఈ మొక్కలను నిర్మూలించవచ్చు.
- ఆయా పంటలలో సంబంధిత కలుపు నాశినిలను ఉపయోగించి కూడా నివారించవచ్చు.

సామూహిక నిర్మూలన చేపట్టాలి



సామాజిక ఆరోగ్య భద్రత దృష్ట్యా పార్థీనియం వంటి సమస్యాత్మక కలుపుమొక్కలను సమర్థంగా నిర్మూలించడం అవసరం. సామాజిక పరంగా ఇది మనందరి బాధ్యత. ఈ మొక్కలకు ఎప్పటికప్పుడు పీకివేసి కాల్చివేయాలి.

శిరీష,
దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

జెడ్పీ సీఈవో ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు



అధికారులతో జెడ్పీ సీఈవో వసంతరాయుడు, ఎంపీడీవో ఆదినారాయణ తదితరులు

గుంటూరు రూరల్: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెంచాలని జెడ్పీ సీఈవో ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు తెలిపారు. గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లాలుపురం గ్రామంలో పారిశుధ్య పనులను ఆయన ఎంపీడీవో ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారులు పర్యవేక్షణ ఉంచాలన్నారు. మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు పరిశుభ్ర పరిచి దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. మురుగునీరు సక్రమంగా పారేలా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డివిజినల్ పంచాయతీ అధికారి లక్ష్మణరావు, విస్తరణాధికారి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పీఎంవీ మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

లక్ష్మీపురం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంధ విద్యార్థులకు తక్షణమే పాఠ్య పుస్తకాలను ముద్రించి అందజేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం నగరంలో హిమని సెంటర్, మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాసర్ మాట్లాడుతూ.. 2017లో కేంద్ర ప్రభుత్వం రూ.1.40 లక్షలు వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంధ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ముద్రించే రెండు ప్రింటింగ్ యంత్రాలు కేటాయించిందని తెలిపారు. యంత్రాలు ప్రింటింగ్ చేసుకోవడానికి వీలుగా గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ 4వ లైనులో రూ.35 లక్షలు కేటాయించి బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న కుమార్ రాజా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రెస్‌లో ప్రహరీ, ఒక మరుగు దొడ్డి , 50 అడుగుల రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.26 లక్షలు కేటాయిస్తే అందులో కూడా అవినీతిగా పాల్పడ్డారని విమర్శించారు. పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని విద్యార్థులు అడిగినందుకు దూషిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే కుమార్ రాజాపై సమగ్ర విచారణ చేసి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పదివేల మంది పైగా అంధ విద్యార్థులు ఉన్నారని ఒక పక్క విద్యా సంవత్సరం ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా కూడా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదన్నారు. బ్రెయిలీ ప్రెస్లో పాఠ్య పుస్తకాల ముద్రణ జరుగుతుందా లేదా అనే సందేహాన్ని వ్యక్తపరిచారు.

సంగీత విద్వాంసులకు 'గాన విదుషి' స్మారక పురస్కారం

- 'గాన విదుషి' గద్దె వేంకట రామకుమారి స్మారక అవార్డును అందుకోనున్న విశిష్ట సంగీత విద్వాంసులు పి.జానకి, బీవీ దుర్గాభవాని
- 29న తెనాలిలో రామకుమారి వర్ధంతి సంగీతోత్సవంలో ప్రదానం
- ఇదే వేదికపై వీణా, గాత్రసంగీత కచేరి ఏర్పాటు



పి.జానకి



బీవీ దుర్గాభవాని

తెనాలి: ప్రముఖ సంగీత విద్వాంసురాలు 'గాన విదుషి' గద్దె వేంకట రామకుమారి నవమ వర్ధంతి సంగీతోత్సవం ఈ నెల 29న తెనాలిలో జరగనుంది. పట్టణానికి చెందిన సంగీత సంస్థ హేమాద్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆ రోజు సాయంత్రం 6.15 గంటలకు పి.కనకదుర్గ వీణా కచేరితో వేడుకలు ఆరంభిస్తారు. అనంతరం గద్దె వేంకట రామకుమారి స్మారక అవార్డు–2024ను విశిష్ట సంగీత విద్వాంసులు పి.జానకి, బీవీ దుర్గాభవానిలకు బహూకరిస్తారు. వీరిద్దరూ రామకుమారి ప్రియశిష్యులు కావటం విశేషం. ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసుడు 'నాదసుధార్ణవ' డాక్టర్ అన్నవరపు రామస్వామి, గుంటూరులోని గాయత్రి మహిళా సంగీత సన్మండలి కార్యదర్శి ఎం.శేషురాణి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. అవార్డు ప్రదానం తదుపరి బీవీ దుర్గాభవానిచే గాత్ర సంగీత కచేరీ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. హేమాద్రి చంద్రకాంత్ వయొలిన్‌పై, కేవీ రామకృష్ణ మృదంగంపై వాద్య సహకారం అందిస్తారు.

గాత్ర విద్వాంసురాలు జానకి..

అవార్డు గ్రహీతల్లో ఒకరైన పి.జానకి సద్గురు శ్రీ త్యాగరాజస్వామి శిష్య పరంపరలో అయిదో తరం వారు. పెదనందిపాడు మండలం రావిపాడు ఈమె స్వస్థలం. రామకుమారి వద్ద ప్రాథమిక విద్య, డాక్టర్ అన్నవరపు రామస్వామి గురువుగా ఉన్నత సంగీత విద్య సాధన చేశారు. విజయవాడలోని జీవీడీ ప్రభుత్వ సంగీత కళాశాలలో 1967–73లో కర్ణాటక గాత్ర సంగీతం డిప్లొమా కోర్సును పూర్తి చేశారు. పిన్న వయసులోనే రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక ఉపకార వేతనం అందుకున్నారు. తాను చదువుకున్న విజయవాడ సంగీత కళాశాలలోనే గాత్ర సంగీత అధ్యాపకురాలిగా పనిచేసి, తర్వాత గుంటూరులోని సంగీత కళాశాలకు బదిలీపై వచ్చారు. 2016లో పదవీ విరమణ చేశారు. 2012లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డును స్వీకరించారు. తెలుగునాటనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ అనేక సభల్లో గాత్ర కచేరీలు చేశారు. 1972 నుంచి ఏటా పారుపల్లి రామకృష్ణయ్య పంతులు పాల్గొంటున్నారు. భక్తి ఛానల్‌లో బ్రహ్మోత్సవాలు, నాదనీరాజనంలో తన గానంతో అలరిస్తున్నారు. బీహై ఆర్టిస్టుగా రేడియో, టీవీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనేక సత్కారాలను అందుకున్నారు.

టాప్‌గ్రేడ్ కర్ణాటక వయొలినిస్ట్ దుర్గాభవాని..

మరొక అవార్డు గ్రహీత బీవీ దుర్గాభవాని వయొలిన్ విద్వాంసురాలు. విజయవాడలో 1965లో సంగీత కుటుంబంలో జన్మించారు. తండ్రి ప్రముఖ హరికథా భాగవతార్. త్యాగరాజ స్వామి పరంపరలోని వారే. డాక్టర్ అన్నవరపు రామస్వామి శిష్యురాలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆరేళ్లు వయొలిన్ అధ్యాపకురాలిగా చేశారు. 1994 నుంచి ఆలిండియా రేడియోలో టాప్ గ్రేడ్ కర్ణాటక వయొలినిస్ట్‌గా కొనసాగుతున్నారు. కర్ణాటక వోకల్‌లో, డివోషనల్ వోకల్‌లోనూ బీహై ఆర్టిస్టుగా ఉన్నారు. ఏఐఆర్‌లో అనేక సంగీత కార్యక్రమాలను కంపోజ్ చేసి, నిర్వహించారు. వీటిలో హరికేశ జనని, త్యాగరాజ రామాయణం, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, ఆదిభట్ల నారాయణదాసు, ఎంఎస్ సుబ్బలక్ష్మి కార్యక్రమాలు ఉన్నాయి. ఉద్యోగంలో చేరకముందే గ్వాలియర్‌లో జరిగిన సౌత్ సెంట్రల్ జోన్ పోటీల్లో ప్రథమ బహుమతిని గెలిచారు. 2012లో ఉత్తమ అధ్యాపక అవార్డుతో సహా, అనేక అవార్డులు, బిరుదులు అందుకున్నారు. వీటిలో సంగీత విద్వన్మణి, వాయులీన కళానిధి, సునధ సుధానిధి, మధుర గాన సరస్వతి, సంగీత కళాకౌముంది వంటివి ఎన్నో. అవార్డు ప్రదానోత్సవ వేళ ఈమె గాత్ర సంగీతాన్ని ఆస్వాదించే అవకాశం, తెనాలి సంగీతాభిమానులకు కలిగింది.

ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలి

కొలకలూరు(తెనాలి): మండలంలోని విత్తన డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్ స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు అంతా నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాలన్నారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులోని రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రేమసాగర్ మాట్లాడుతూ రైతులు విత్తనాలను విత్తేముందు విత్తన మొలకశాతం కట్టాలని సూచించారు. వంద విత్తనాలకు 80 పైగా విత్తనాలు మొలకెత్తితే అది మంచి విత్తనమని నిర్ధారించుకుని విత్తాలని సూచించారు. ఆ విధంగా లేకుంటే సంబంధిత విత్తన బ్యాగ్‌ను రిటర్న్ చేయాలని సలహానిచ్చారు. భూసార పరీక్షల కోసం రైతు భరోసా సిబ్బంది మట్టి నమూనాలను సేకరిస్తున్నారని చెప్పారు. ఎరువుల కోసం ఆర్‌బీకేలను వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామ సర్పంచ్ సీహెచ్ ప్రీతి అశోక్‌కుమార్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, విత్తనాలను తీసుకోవాలని సలహానిచ్చారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. సదస్సులో వీఏఏలు నాగరాజు, నాగేంద్ర, శివతేజ, వీఆర్‌ఓ నితీష్‌కుమార్, రైతులు గుంటూరు కృష్ణమోహన్, ఆరంబాక నాగేశ్వరరావు, తాడిబోయిన చంద్రశేఖర్, గుమ్మడిదల సుబ్బారావు, తాళ్లూరి వెంకట్రావు, పూనంశెట్టి రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

పృథువు పుణ్య చరిత్ర చదివితే శుభాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న అన్నమయ్య కళా వేదికపై రెండు రోజుల తిరుప్పావై అమృత వర్షిణి డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగ నాయకి ప్రబంధ సాహిత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలు గురువారం మొదలయ్యాయి. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట శ్రీరంగనాయకి ప్రసంగిస్తూ పృథువు పుట్టుక అయోనిజమైనదన్నారు. పృథు మహారాజు మహా వైభవంగా 99 అశ్వమేథాలు పూర్తి చేసి, వందవ యాగాన్ని ప్రారంభించి యజ్ఞేశ్వరుడైన శ్రీహరిని ఆరాధించారని తెలిపారు. దీనిని చూసి ఇంద్రునికి అసూయ కలిగి.. మాయా వేషంతో యజ్ఞపశువును అపహరించి ఆకాశ మార్గాన వెళ్లారన్నారు. ఈ విషయాన్ని అత్రి మహాముని పృథు చక్రవర్తి కుమారునికి చెప్పగా, ఆయన కోపంతో ఆకాశంలోని ఇంద్రునిపైకి దుమికాడన్నారన్నారు. ఇంద్రుడు దొంగ వేషాన్నీ, గుర్రాన్ని విడిచి పారిపోయాడన్నారు. పృథు పరాక్రమానికి మెచ్చిన మునులు అతనికి 'జితాశ్వుడు'గా నామకరణం చేశారని వివరించారు. పృథు చక్రవర్తి పుణ్య చరిత్ర విన్నా, చదివినా శుభాలు కలిగిస్తాయని చెప్పారు..

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్చాలి



వేజండ్లలో కార్యక్రమంలో పాల్గొన్న శాఖాధికారులు, ఉపాధ్యాయులు తదితరులు

వేజండ్ల(చేబ్రోలు) బడి ఈడు వయస్సు కలిగిన పిల్లలను తప్పకుండా పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి ఏవీహెచ్ ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో నేను బడికి పోతా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల్లో ప్లకార్డులు, ఫ్లెక్సీలు చేతపట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బడి బయట ఉన్న పలువురు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపటానికి అంగీకరించారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండల విద్యాశాఖాధికారులు –1, 2లు ఏవీహెచ్ ప్రసాద్, రాయల సుబ్బారావులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలు, తగిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ శ్రీ,, సీఆర్పీ సంపూర్ణమ్మ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఈసావర్మ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహనా సదస్సు



డాక్టర్ అనితను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఆనందమయ జీవితానికి ఆరోగ్యంపై నిరంతర శ్రద్ధ తప్పనిసరని రమేష్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్. అనిత తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ వెల్ఫేర్ కమిటీ ఆధర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలలో అధికంగా కనిపించే వివిధ అనారోగ్య సమస్యల గురించి వివరించారు. వాటికి కారణాలు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. పోషకాహారం, వ్యాయామం, ధ్యానం వంటివి శారీరక దృఢత్వంతోపాటు మనస్సును ఉత్తేజపరుస్తాయని చెప్పారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో పోటీతత్వంతో మానసిక ఒత్తిడి ఎక్కువైందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్‌తెలిపారు. దీనిని అధిగమించేందుకు ఆహారం, వ్యాయామ నియమాలు పాటించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం అవసరమని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్‌లు తెలిపారు. దీనిపై తమ కళాశాల దృష్టి సారించి ప్రముఖ వైద్యులతో ఇలాంటి అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అతిథులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఉమెన్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కె.రాధారాణి తదితరులు సన్మానించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



పాఠశాలలో చేరిన చిన్నారులతో ఎంఈఓలు కెనడీ, విజయ్ భాస్కర్

కొమ్మూరు(కాకుమాను): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని, దానిని ప్రతి చిన్నారికి ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమ్మూరులో గురువారం విద్య ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ.. విద్య మనిషి మూడో నేత్రమని, అలాంటి విలువైన విద్యకు చిన్నారులకు దూరం చేయకూడదని తెలిపారు. 6 – 14 సంవత్సరాల చిన్నారి తప్పని సరిగా పాఠశాలలోనే ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నలుగురు బడిఈడు పిల్లలను గుర్తించి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక (స్పెషల్) పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 విజయ్ భాస్కర్, ఉన్నత పాఠశాల హెచ్ఎం రంగారావు, శ్యామ్ కుమారి, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ శిఖరం బొజ్జా తారకం



అంబేడ్కర్, బొజ్జా తారకం చిత్ర పటాలకు నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

నెహ్రూనగర్: న్యాయ వృత్తినే ఆయుధంగా చేసుకొని ఎస్సీ ఎస్టీ సమస్యలపై పోరాటం చేసిన గొప్ప మేధావి, న్యాయ కోవిదుడు బొజ్జా తారకం అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ళ ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం అరండల్ పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో బొజ్జా తారకం 83వ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతూ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని రాష్ట్ర మంతా వ్యాపింపజేశారన్నారు. 1985 కారంచేడు దళితుల మారణ హోమానికి నిరసనగా దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉద్యమ నిర్మాణంలో తన వంతు పోరాటాన్ని కొనసాగించారని గుర్తుచేశారు. డాక్టర్ కత్తి పద్మారావుతో పాటుగా కేజీ సత్యమూర్తి, గద్దర్ లాంటి ప్రముఖ ఉద్యమకారులతో పని చేసి అనేక ఉద్యమాలకు న్యాయపరమైన సలహాలు సూచనలు అందించారని, బాధితులకు అండగా నిలిచిన గొప్ప న్యాయ శిఖరం బొజ్జ తారకం అని కొనియాడారు. పలు సంఘాల నాయకులు ఉగ్గం సాంబశివరావు, సాదు మాల్యాద్రి పాల్గొన్నారు.

విద్యా సంస్థల బస్సులపై కేసులు నమోదు



తెనాలిరూరల్: పత్రాలు సరిగ్గా లేని పలు విద్యాసంస్థల బస్సులకు రవాణా శాఖ అధికారులు జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేశారు. జిల్లా ఉప రవాణా అధికారి షేక్ కరీమ్ ఆదేశాల మేరకు తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి కె.ప్రసాద్ నేతృత్వంలో తెనాలి రవాణా శాఖ కార్యాలయ పరిధిలోని చేబ్రోలు వద్ద రవాణా శాఖ అధికారులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. పత్రాలు సరిగ్గా లేని ఆరు విద్యాసంస్థల బస్సులను గుర్తించారు. వాటికి జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు మాట్లాడుతూ విద్యా సంస్థల బస్సులు కచ్చితంగా 32 రకాల నిబంధనలు పాటిస్తూ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని వెల్లడించారు. పాఠశాల బస్సు డ్రైవర్ 60 సంవత్సరాల వయో పరిమితి దాటిన వ్యక్తి అయితే అనర్హుడని పేర్కొన్నారు. డ్రైవర్ ప్రతి మూడు నెలలకొకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆ రికార్డులు భద్ర పరచాలని వివరించారు. డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీవో అధికారులకు తెలియజేయడంతో పాటు ఐదేళ్ల అనుభవం , హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి నెలా వాహనానికి సంబంధించి స్థితి గతులను నమోదు చేయాలని తెలిపారు. బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరచుకునే బాక్స్‌లు తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. విద్యా సంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా వాహనాలను సరైన కండీషన్‌లో ఉంచుకుని రూల్ 185(జీ) నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. ఫిట్‌నెస్ లేని బస్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ తిప్పకూడదని స్పష్టం చేశారు. అలా తిరిగే వాహనాలు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌బీ మధుసూదనరావు, సిబ్బంది ఉన్నారు.

దేశం ఎదుర్కొనే సమస్యలపై చర్చ జరగాలి

లక్ష్మీపురం: రాజకీయాలను పక్కన పెట్టి.. దేశం ఎదుర్కొనే సమస్యలపై 18వ లోక్ సభలో చర్చ జరిగేలా చూడాలని విశ్లేషకులు ఆర్.వి సింగరయ్య పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన చర్చ గోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచికో, చెడుకో ఇవాళ దేశ ప్రజలు రెండు కూటముల వైపే మొగ్గు చూపారని ఎన్డీయే కూటమి, ఇండియా కూటమిలో భాగం కాని పార్టీలను ప్రజలు దాదాపు తిరస్కరించారన్నారు. భారత దేశం రెండు రాజకీయ శిబిరాల మధ్య విభజితమైందని, అయితే రాజకీయాలకే పరిమితం కాదని అభివృద్ధి నుంచి ప్రజా సమస్యల వరకూ అవలంభించాల్సిన సైద్ధాంతిక దృక్పదానికి సంబంధించిందనే స్పష్టమవుతుందన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివామిరెడ్డి, ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ 17వ లోక్ సభలో అనేక అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. అనేక ముఖ్యమైన బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదమయ్యాయని బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ సక్రమంగా జరగలేదన్నారు. 18వ లోక్ సభ కాలంలో గత సమావేశాల నాటి సంక్లిష్ట పరిస్థితులు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు ప్రసంగించారు.